క్లుప్తంగా

నేడు సీతారాముల కల్యాణం

కొడకండ్ల: మండలంలోని లక్ష్మక్కపల్లిలోని సీతారామాజంనేయ స్వామి ఆలయంలో అధ్యయన భక్తోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా సేవాకాలం, సమ్మాళ్వార్ పరమపదోత్సవం వంటి కార్యక్రమాలను ఆదివారం పండితులు నిర్వహించారు. సోమవారం ఉదయం 11 గంటలకు సీతారాముల కల్యాణాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆలయ కమిటీ కోరింది.

'ఎంపీ టికెట్ ఇవ్వండి'



జనగామ: రాబోయో పార్లమెంట్ ఎన్నిల నేపథ్యంలో వరంగల్ లోక్‌సభ నుంచి పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని కోరుతూ ఆదివారం హైదరాబాద్ గాంధీ భవన్‌లో ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాసుమున్షీకి పార్టీ రాష్ట్ర నాయకుడు రామగల్ల పరమేశ్వర్ బయోడేటా సమర్పించారు. ఆయన మాట్లాడుతూ 2009, 2014లో ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయడం జరిగిందని చెప్పారు. ఈ సారి వచ్చే ఎన్నికల్లో తన పేరును పరిశీలించాలని కోరడం జరిగిందని చెప్పారు.

'పెరుమాండ్ల'కు వరంగల్ ఎంపీ టికెట్ ఇవ్వాలి

జఫర్‌గఢ్: బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా పని చేస్తున్న పెరుమాండ్ల వెంకటేశ్వర్లుకు పార్టీ నుంచి వరంగల్ ఎంపీ టికెట్‌ను కేటాయించాలని తెలంగాణ మాల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి శ్రీరాముల పైడి కోరారు. తెలంగాణ మాల పోరాట సమితి ఆధ్వర్యంలో మండలంలోని ఉప్పుగల్లులో ఆదివారం నిర్వహించిన సమావేశానికి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దండ్రే అనిల్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా పైడి హాజరై మాట్లాడారు. క్రమశిక్షణతో పార్టీలో పని చేస్తూ పార్టీ నిర్వహించే కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న వెంకటేశ్వర్లుకు వరంగల్ పార్లమెంట్ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం కల్పించాలని కోరారు. సంఘం రాష్ట్ర నాయకులు శ్రీనివాస్, రమేష్, పవన్, అనిల్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత



పాలకుర్తి: మండలంలోని దర్దేపల్లి గ్రామంలో ఇటీవల తాటి చెట్టు పైనుంచి పడి గిరగాని యాకయ్య మృతి చెందాడు. కాగా, ప్రభుత్వం నుంచి మంజూరైన రూ. 25వేల చెక్కును మృతుడి భార్య వరలక్ష్మికి ఆదివారం అందజేశారు. గౌడ జన హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల వెంకటేశ్వర్లు, గిరగాని సమ్మయ్య, కమ్మగాని పరమేశ్వర్ గౌడ్, తాళ్ల సోమనారాయణ, పొడిశెట్టి వెంకన్న, నర్సయ్య, తాళ్లపెల్లి కుమారస్వామి, సుధాకర్, గిరగాని నాగన్న, సుధాకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కుల చెల్లింపు



చిల్పూరు: మండలంలోని లింగంపల్లి సమ్మక్క-సారలమ్మ జాతరను ఆదివారం సీఐటీయూ ఆల్ హమాలీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అపరాదపు రాజు సందర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భక్తులు ఎక్కడ పడితే అక్కడ వదిలిన వ్యర్థాలు, చెత్తాచెదారం శుభ్రం చేయడంలో కార్మికుల సేవలు అభినందనీయమన్నారు. తాటి రమేష్, శ్రీరాముల శ్రీను, ఆవుల రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవ విగ్రహాలకు రూ.41వేల విరాళం



లింగాలఘణపురం: మండల కేంద్రంలోని వీరన్నగుట్ట వద్ద ఏర్పాటు చేయనున్న వీరభద్రస్వామి, భద్రకాళి ఉత్సవ విగ్రహాల ఏర్పాటుకు రిటైర్డ్ ప్రొఫెసర్ కేమిడి ఐలయ్యాచాయదేవి దంపతులు, వీరి కూతురు, అల్లుడు శ్రీలం శివానివేణుగోపాల్ రూ.41,116 విరాళం అందజేశారు. హైదరాబాద్‌లో ఉంటున్న వారి వద్దకు ఆదివారం ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు కలిసి వెళ్లి ఉత్సవ విగ్రహాల కోసం విరాళం కోరగా వెంటనే స్పందించి చెక్కు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బండ్రు సత్తయ్య, ఎంపీటీసీ భిక్షపతి, పీఏసీఎస్ చైర్మన్ శ్రీశైలం, వీరయ్య, వెంకటేశ్, నాగరాజు తదితరులు ఉన్నారు.

నాలాపై కప్పు ఏదీ..!

- ప్రమాదకరంగా ఉన్నా పట్టించుకోవడం లేదు
- కంపుకొడుతున్న డ్రెయినేజీలు



హైదరాబాద్ రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న నాలా

జనగామ: పట్టణంలో కాలనీలు వరద ముంపునకు గురి కాకుండా ఇటీవల హైదరాబాద్ రోడ్డులో చేపట్టిన నాలా నిర్మాణాలు ప్రజల పాలిట శాపంగా మారాయి. వ్యాపార, వాణిజ్య, నివాస గృహాల ఏరియాలో ఏర్పాటు చేసిన నాలాల నిర్వహణపై మునిసిపల్ అధికారులు చేతులెత్తేశారు. నాలాలపై పైకప్పు నిర్మాణాలు చేపట్టక పోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకు వస్తుందోననే భయంలో ప్రజలు ఉన్నారు. సురక్ష హాస్పిటల్, ఓ బార్ సమీపంలో నిండిన నాలాలపై తాత్కాలిక ఏర్పాట్లతో రాకపోకలను సాగిస్తున్నారు. ఇటీవల కాలంలో మద్యం సేవించిన పలువురు బయటకు వచ్చే సమయంలో ప్రమాదవ శాత్తు ఇందులో పడ్డ సంఘటనలు ఉన్నాయి. నాలాలో మురికి నీరు.. సిల్ట్ నిండిపోయి.. దుర్వాసన వెదజల్లుతోంది. ముక్కులు దద్దరిల్లేలా వచ్చే వాసనతో ప్రజలు సైతం అనారోగ్యాల బారిన పడుతున్నారు. రోడ్డు విస్తరణ పనులు పూర్తయినా.. నాలా పై కప్పు వేయడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో పలుమార్లు వినతి చేసినా.. వాటిని చెత్త బుట్టలో పడేస్తున్నారే తప్ప పరిష్కారం చూపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పార్టీ బలోపేతానికి కృషిచేయాలి



సత్తయ్యను సన్మానిస్తున్న రాజశేఖర్ తదితరులు

దేవరుప్పుల: గ్రామీణ ప్రాంతాల్లో బీజేపీ బలోపేతం కోసం నూతన కార్యవర్గం కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దుబ్బ రాజశేఖర్ గౌడ్ సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోని భార్గవి గార్డెన్‌లో జరిగిన ప్రత్యేక సమావేశంలో మండల అధ్యక్షుడిగా ఎన్నికైన కాసాని సత్తయ్యను సత్కరించి అభినందనలు తెలిపారు. దేశంలో ప్రధాన మంత్రి మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై ఇంటింటా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి చింత సృజన్‌కుమార్, మాజీ మండల అధ్యక్షుడు బాగాల నవీన్‌రెడ్డి, మండల నాయకులు రాజోజు నర్సింహ్మాచారీ, శ్రీను,ఇల్లెందుల బాస్కర్, గణేష్, ఐలయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతమే ధ్యేయం

చిల్పూరు: నియోజకవర్గంలో బీజేపీ బలోపేతమే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని పార్టీ ఓబీసీ మోర్చ జిల్లా అధ్యక్షుడు బాల్నె శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆదివారం జిల్లా, మండల అధ్యక్షులను పార్టీ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు గంటె ఉపేందర్ యాదవ్‌తో కలిసి ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. తోకల సంపత్‌రెడ్డి, కన్నెబోయిన రవి, సాదం వేణు, దోరం శ్రీనివాస్, వెలిశాల శ్రీనివాస్, సాదం బీమన్న, వేల్పుల సంపత్, ముక్కెర రమేష్, రజనీకర్, రమేష్, రాజేందర్, వెంకటేష్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ శ్రేణులు అధైర్య పడొద్దు



పరామర్శిస్తున్న ఎర్రబెల్లి

దేవరుప్పుల: బీఆర్‌ఎస్ శ్రేణులు అధైర్య పడొద్దని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సూచించారు. ఆదివారం మండలంలోని కోలుకొండ బీఆర్‌ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు వల్లపు కుమార్ తండ్రి కొమురయ్య ఇటీవల మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబ సభ్యులను దయాకర్‌రావు పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. మాజీ సర్పంచ్ కూర్నాల రవి, బీఆర్‌ఎస్ మండల నాయకులు పాము మోహన్, ఖాసీమ్ కన్న రామ్మూర్తి, బోనగిరి యాకస్వామి, ఇంద్రస్వామి, కోతి పద్మ, యామగాని కరుణమ్మ, నాగయ్య, ప్రభాకర్‌జీ, మాచర్ల బాబు ఉన్నారు.

సీఐని కలిసిన బీజేపీ నాయకులు



సీఐని సత్కరిస్తున్న నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్: భారతీయ జనతా పార్టీ మండల శాఖ నూతన అధ్యక్షుడిగా నియమితులైన సట్ల వెంకటరమణగౌడ్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు స్థానిక సీఐ ముస్కు రాజును ఆదివారం ఘన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఐకి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. బీజేపీ నాయకులు రడపాక ప్రదీప్, చట్ల రాజు, కుమ్మం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా..



నివాళులర్పించిన యువకులు

కొడకండ్ల: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రామవరం గ్రామానికి చెందిన బండారి సుధీర్ కుటుంబానికి యువకులు, మిత్రులు ఆర్థికసాయం చేశారు. సుధీర్ అకాల మృతితో కుటుంబం దిక్కుతోచని స్థితిలో ఉండగా గ్రామ యువకులు, మిత్రులంతా కలిసి రూ.లక్ష విరాళాలు పోగుచేసి మృతుడి పిల్లల పేరిట ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసేందుకు నిర్ణయం తీసుకొన్నారు. ఆదివారం జరిగిన దశదిన కర్మలో వారు సుధీర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

తాటికొండ దర్గాలో ఉర్సు



ఉర్సు ఉత్సవాల్లో పాల్గొన్న వైస్ ఎంపీపీ

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని తాటికొండ గ్రామంలోని దర్గాలో గ్రామ ముస్లిం దర్గా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉర్సు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కాగా వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి ఉర్సు ఉత్సవాలకు హాజరుకాగా దర్గాకమిటీ బాధ్యులు ఘన స్వాగతం పలికారు. వైస్‌ఎంపీపీ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉర్సు ఉత్సవాలతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో దర్గా పీఠాధిపతి కుర్బన్ అలీ, దర్గా కమిటీ సభ్యులు ఎండీ.అబ్బాస్, మొహమ్మద్ మోసిన్‌అలీ, మహమ్మద్ ఆజం, ఆరాఫత్, మహమ్మద్ పాల్గొన్నారు.

యాత్రను విజయవంతం చేయాలి



యాత్ర స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

జఫర్‌గఢ్: మండలంలోని తమ్మడపల్లి (జి) గ్రామం నుంచి మార్చి 1న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి చేపట్టనున్న విజయసంకల్ప యాత్రను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కోరుకొప్పుల నాగేష్‌గౌడ్ పిలుపునిచ్చారు. తమ్మడపల్లి (జి) శివారు నుంచి ప్రారంభించనున్న యాత్ర స్థలాన్ని పార్టీ బృందంతో కలిసి నాగేష్‌గౌడ్ ఆదివారం పరిశీలించి మాట్లాడారు. ఈ యాత్రలో బీజేపీ శ్రేణులతో పాటు అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు అయిలోని అంజిరెడ్డి, ఎండీ వలిపాష, బుర్ర తిరుపతిగౌడ్, పందిబోయిన రాజు, సింగారపు రమేష్, పవన్‌యాదవ్, అనిల్, చిరంజీవి, రాపర్తి వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రశాంతి' విద్యార్థికి ప్రశంసపత్రం



హైదరాబాద్‌లో అబాకస్ స్టేట్‌మీట్‌లో ప్రశంసాపత్రం అందుకుంటున్న శివ

దేవరుప్పుల: హైదరాబాద్ కూకట్‌పల్లిలోని పీఎస్‌ఎం హైస్కూల్‌లో రాష్ట్ర స్థాయి అబాకస్, వేదిక మ్యాథ్స్ పోటీ పరీక్షల్లో మండల కేంద్రంలోని శ్రీ సాయి ప్రశాంతి విద్యానికేతన్ హైస్కూల్‌కు చెందిన మూడో తరగతి విద్యార్థి యామ శివ అత్యుత్తమ ప్రతిభ కనబర్చడంతో ఆదివారం ప్రశంస పత్రం అందుకున్నాడు. ఇటీవల జిల్లా కేంద్రంలో యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాలతో కలిపి జోనల్ స్థాయిలో ప్రథమ స్థానం పొందిన శివ రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి ప్రశంసపత్రం పొందడంపై హైస్కూల్ కరస్పాండెంట్ టి.పాండు కృష్ణ, ప్రిన్సిపాల్ జీవీకే ప్రసాద్, ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేశారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

రఘునాథపల్లి: మండలంలోని నిడిగొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1986–87 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని పెంబర్తిలోని సృజన హోమ్స్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అతికం ప్రభాకర్‌గౌడ్, తిరుమల్‌కుమార్, నరసింహ, భానూజా, శ్రీనివాస్, ప్రభాకర్, కరుణాకర్, నర్సయ్య, మల్లేష్, సిద్ధిరాములు, వాణి, కవిత తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ



పరీక్ష ప్యాడ్లతో విద్యార్థులు

చిల్పూరు: మండలంలోని పల్లగుట్ట గ్రామ సెనెర్జియా గ్రూప్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ జీడి జాన్ ఆధ్వర్యంలో ఆదివారం పెండ్యాల మోహన్ 16వ వర్ధంతి సందర్భంగా ఆయన సతీమణి శోభారాణి, కుమారుడు శ్రావణ్, కుమార్తె సారిక 30 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను అందజేశారు. ఈ సందర్భంగా దాత శోభారాణి మాట్లాడుతూ తన భర్త బతికున్న రోజుల్లో పేద విద్యార్థులను గుర్తించి విద్యాపరంగా వారికి కావాల్సినవి అందించేవారన్నారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో సాయిరాం, విజయ్, కృపాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకర చెట్ల తొలగింపు



మలుపు వద్ద చెట్లను తొలగిస్తున్న ఎస్సై

జఫర్‌గఢ్: మండలంలోని తిమ్మంపేట గ్రామ శివారులో మలుపు వద్ద రోడ్డుకు ఇరువైపుల ప్రమాదకరంగా ఉన్న చెట్లను తొలిగించే కార్యక్రమాన్ని స్థానిక ఎస్సై మహేందర్ ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి జఫర్‌గఢ్ మండల కేంద్రానికి వచ్చే ప్రధాన రహదారిలో తిమ్మంపేట గ్రామ సమీపాన మలుపు వద్ద రోడ్డుకు ఇరువైపుల చెట్లు పెరగడం వల్ల తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇటీవల రెండు వాహనాలు ఢీకొని పలువురు గాయపడ్డారని తెలిపారు. దీంతో డీసీపీ, ఏసీపీ ఆదేశాల మేరకు ప్రమాదాలను నివారించేందుకు రోడ్డుకు ఇరువైపుల పెరిగిన చెట్లు, ముళ్ల పొదలను జేసీబీ, డోజర్ యంత్రాల ద్వారా తొలిగించామన్నారు. వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపనకు భూమిపూజ



భూమి పూజ చేస్తున్న పూజారి, గ్రామస్తులు

తరిగొప్పుల: మండలకేంద్రంలో బొడ్రాయి ప్రతిష్ఠాపనకు ఆదివారం భూమిపూజ నిర్వహించారు. పండితులు చెప్యాల సతీష్‌శర్మ వేదమంత్రాల నడుమ గ్రామ పెద్దలు, కుల పెద్దలు బొడ్రాయి స్థాపన భూమి పూజ ముహూర్తంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎంపీటీసీ అర్జుల మధుసూదన్‌రెడ్డి, చిలువేరు లింగం, అంకం శ్రీనివాస్, తలకొక్కుల రవి, సుంకరి యాదగిరి,బూస యాదగిరి, ఆవుల రాములు, తాళ్లపల్లి పోషయ్య, నేతుల సత్తయ్య, పర్శని కొమురయ్య పాల్గొన్నారు.

ముగిసిన మడేలయ్య ఉత్సవాలు



ప్రతిష్ఠించిన మడేలేశ్వరస్వామి విగ్రహం

బచ్చన్నపేట: మండల కేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మడేలేశ్వరస్వామి ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఆదివారం కనులపండువలా ముగిశాయి. శనివారం రాత్రి శివపార్వతుల కల్యాణం నిర్వహించగా రజక కుటుంబాలు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నాయి. అనంతరం మేకలు, కోళ్లు బలి ఇచ్చి వన భోజనాలకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పెనుబెల్లి వెంకటేశ్వర్లు, సభ్యులు దేవరకొండ రమేష్, పోచంపెల్లి శ్రీనివాస్, కుల పెద్ద మిన్నాలపురం చెన్నయ్య ఆధ్వర్యంలో ఉత్సవాలు ప్రశాంతంగా జరిగాయి.

అన్నదానం



జనగామ: జిల్లా మిత్ర బృందం ఆధ్వర్యంలో స్థాపించిన యూనిటీ మ్యాక్స్ వసంతాలు పూర్తయిన సందర్భంగా ఆదివారం స్థానిక వర్ధన్ ఆశ్రమంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనిటీ మ్యాక్స్ సొసైటీ అధ్యక్షుడు సంతోష్ కుమార్, ప్రధాన కార్యదర్శి విక్టరీరాజు, కోశాధికారి విష్ణు, ఉపాధ్యక్షులు మల్లికార్జున్, ప్రసాద్, వంశీకృష్ణ, అంకుష్, ఉదయ్, శ్రీధర్, సాం బశివరావు, గౌతం, సరిత, చైతన్య, వర్ధన్ ఆశ్రమం నిర్వాకురాలు కత్తుల లక్ష్మి ఉన్నారు.

వైద్యశిబిరం



పాలకుర్తి టౌన్: లేబర్ కార్డు కలిగిన వారికి సీఎస్సీ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యం అందజేస్తున్నామని జిల్లా కో–ఆర్డినేటర్ రామంచ సుమన్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపంలో ఉచిత ఆరోగ్య శిబిరానికి 150 మంది వచ్చారని, వారికి పరీక్షలు నిర్వహించి వైద్యసేవలు అందించడం జరిగిందన్నారు.కోఆర్డినేటర్ అఫ్రోజ్ జహంగీర్, వైద్య సిబ్బంది మానస, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న మురళి

బచ్చన్నపేట: జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు తేలుకంటి మురళి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా శ్రీనివాస్‌రెడ్డి నియామకంపై క్లబ్ గౌరవ అధ్యక్షుడు మూసిని వీరాగౌడ్ ఆధ్వర్యంలో సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అక్రిడిటేషన్ కలిగి, సీనియారిటీ ఉన్న ప్రతి జర్నలిస్టుకు మండల కేంద్రంలో స్థలాలు ఇప్పించి ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. అదే విధంగా ప్రతీ జర్నలిస్టుకు హెల్త్ కార్డులు, రాష్ట్రమంతటా ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జర్నలిస్టులు గంట తిరుమల్‌రెడ్డి, మేకల శ్రీనివాస్‌రెడ్డి, రెడ్డెబోయిన హరికుమార్, తేలుకంటి శ్రీనివాస్, మల్యాల బాల్‌నర్సయ్య, సందెల బాల్‌సిద్దులు, పంబాల మల్లేశం, గర్నెపల్లి కరుణాకర్, తాడిచెట్టు భాస్కర్ పాల్గొన్నారు.

గ్రామాలకు వారధిగా క్రీడా పోటీలు నిలవాలి



విజేతలకు నగదు, షీల్డు అందజేస్తున్న ఎస్సై, దాత

చిల్పూరు: గ్రామాలకు వారధిగా క్రీడాపోటీలు నిలవాలని ఎస్సై బొల్లం వినయ్‌కుమార్ అన్నారు. మండలంలోని పల్లగుట్ట గ్రామంలో ఆదివారం ఎస్‌ఆర్ స్పోర్ట్స్, పల్లగుట్ట క్రికెట్ టోర్నమెంట్ (పీపీఎల్–1) పోటీల ముగింపు కార్యక్రమానికి చిల్పూరుగుట్ట ఆలయ శాశ్వత దాత పొట్లపల్లి శ్రీధర్‌రావు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజులు హాజరయ్యారు. చివరిరోజు క్రీడల్లో స్టేషన్‌ఘన్‌పూర్ ప్రథమ, పల్లగుట్ట ద్వితీయ స్థానంలో నిలువగా మొదటి బహుమతిగా శ్రీధర్‌రావు తండ్రి చక్రధర్‌రావు జ్ఞాపకార్థం రూ. 25 వేల ు నగదుతో పాటు షీల్డు, రెండో బహుమతిగా పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజు రూ.10 వేలు నగదు, షీల్డు, గుర్రపు రమేష్ రూ. 5వేలు నగదును ఇచ్చారు. టోర్నమెంట్ మాన్ ఆఫ్ ది సిరీస్‌ను ఎనగందుల రత్నాకర్‌రెడ్డి అందించారు. కార్యక్రమంలో జీడి ఆనందం, గుర్రపు రమేష్, అశోక్‌పాల్, దార రజనీ కుమార్, సతీష్‌రెడ్డి, రాజేష్‌ఖన్నా, రాజ్‌కుమార్, రమేష్, సతీష్, రణదీర్, గిరిబాబు, చింటు, టింకు, నిరంజన్, అనీల్, మధు, విష్ణు ఉన్నారు.

'వ్యక్తిగతంగా ఎంపిక చేయడం సరికాదు'

బచ్చన్నపేట: ఇటీవల బీజేపీ జిల్లా అధ్యక్షుడు దశమంతరెడ్డి.. మండల బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు, నాయకులను అడుగకుండా కేవలం వ్యక్తిగతంగా ఏకాభిప్రాయంతో మండల అధ్యక్షుడుగా చిమ్ముల నరేందర్‌రెడ్డిని ఎన్నుకోవడం సరికాదని బీజేపీ నాయకులు అన్నారు. ఆదివారం సోషల్ మీడియా వేదికలా పలువురు నాయకులు బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డిపై పలు విమర్శలు చేశారు. బచ్చన్నపేట మండలంలో ఇప్పటి వరకు సద్ది సోమిరెడ్డి మండల అధ్యక్షుడిగా ఉంటూ గడిచిన శాసన సభ ఎన్నికలను కూడా సమర్థవంతంగా ఎదుర్కొన్నారు.

కానీ ఇటీవల ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు.. మండల బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు, నాయకులను అడుగకుండా కేవలం వ్యక్తిగతంగా మండల అధ్యక్షుడుగా చిమ్ముల నరేందర్‌రెడ్డిని ఎన్నుకోవడం ఏమిటని ప్రశ్నించారు. మండల అధ్యక్షున్ని ఎన్నుకోవడానికి మండల కేంద్రంలో సమావేశం ఏర్పాటు చేమకపోవడమేమిటని అన్నారు. రాష్ట్ర నాయకులు జోక్యం చేసుకొని మండల అధ్యక్షుడిని ఎన్నుకోవాలని, పార్టీకి పని చేస్తూ కార్యకర్తలను సమన్వయ పర్చే అభ్యర్థిని నియమిస్తే అనుకూలంగా ఉంటుందని, పాత అధ్యక్షుడు సోమిరెడ్డినే కొనసాగించాలని పలువురు వారి అభిప్రాయాలను వెలిబుచ్చుతున్నారు. ఎంపీ ఎన్నికల్లో చాలా మంది బీజేపీ అభ్యర్థిని ఆదరించాలని ఓ అభిప్రాయంతో ఉండడంతో మండల అధ్యక్ష ఎన్నికల పేరున పార్టీని చీల్చే ప్రయత్నం జిల్లా నాయకులు చేస్తున్నారని వెంటనే ఈ ఎన్నికలను విరమించుకోవాలని పలువురు నాయకులు కోరుతున్నారు.